(Eenadu - Sthiravasam 13/11/08)

# పుంజుకుంటుంది 2009లో!

గతంతో పోలిస్తే మార్కెట్ ప్రస్తుతం స్థిరంగా ఉందని.. ఐటీ నిపుణులు ఫ్లాట్లను కొనటానికి ఆసక్తి చూపిస్తున్నారని అపర్ణా గ్రూప్ డైరక్టర్ డీఎస్ ప్రసాద్ అన్నారు. నలగండ్లలోని 'సరోవర్'లో సంస్థ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నగర చరిత్రలో.. ఇరవై అంతస్తుల దాకా నిర్మాణ పనులు పూర్తయిన ప్రాజెక్టు తమదేనని అన్నారు. మన స్థిరాస్తి మార్కెట్‌కు వచ్చిన నష్టమేం లేదని తెలిపారు.పూర్తి వివరాలు ఆయన మాటల్లోనే..

'అమెరికాలో ఐటీ ఉద్యోగుల్ని తొలగించినట్లే.. తమనూ తీసివేస్తారన్న ఆందోళనలు ఇక్కడి సాఫ్ట్‌వేర్ నిపుణులకు లేదు. ఉద్యోగుల్ని తొలగించబోమని ఇప్పటికే పలు పేరెన్నిక గల సంస్థలూ ప్రకటించాయి. దీంతో ఐటీ ఉద్యోగులు కొనుగోళ్ళు జరపటానికి ఆసక్తి చూపుతున్నారు. ఇటీవల 'సైబర్ కమ్యూన్' ప్రాజెక్టులో మూడొందల ఫ్లాట్లను ఒక ఐటీ సంస్థ ఉద్యోగులకు విక్రయించాం. అపర్ణా సరోవర్ సమీపంలోనే ఈ ప్రాజెక్టు వస్తోంది. చదరపు అడుక్కి రూ. 2,700 చొప్పున అమ్మాం. ఇతర సంస్థల ఉద్యోగులూ ఇందులో కొనుగోలు చేశారు. ఇందులో మహా అంటే ఎనభై, తొంభై మిగిలి ఉంటాయేమో! మార్కెట్ పూర్తిగా పడిపోతే ఇన్నిన్ని ఫ్లాట్లను అమ్మేవారమా చెప్పండి?



❑ ధరలు మరింత తగ్గుతాయన్న ఆశతో చాలామంది ఫ్లాట్లను కొనటానికి ముందుకు రావట్లేదు. అయితే ప్రతిఒక్కరూ గుర్తించాల్సిన విషయం ఏమిటంటే.. ఇప్పటికే మార్కెట్లో దాదాపు పది శాతం దాకా ధరలు తగ్గుముఖం పట్టాయి. ఇంకా తగ్గుతాయని అనుకోవటం అపోహే. కాబట్టి స్థిర నివాసం ఏర్పాటు చేసుకోవాలని భావించేవారికిదే సరైన తరుణం. 2009లో మార్కెట్ మళ్లీ పుంజుకుంటుంది కాబట్టి ప్రస్తుతం ఉన్న ధర భవిష్యత్తులో ఉండకపోవచ్చు'